సాక్షి
మెదక్

శనివారం, 21, అక్టోబర్, 2023



100 శాతం పోలింగే లక్ష్యం

వంద శాతం పోలింగే లక్ష్యంగా ఎన్నికల అధికారులు ముందుకు సాగుతున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించింది. వివరాలు 2లో ▸



వీడని ఉత్కంఠ

నర్సాపూర్ కాంగ్రెస్ టికెట్ కోసం పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాలు 2లో ▸



బగలాముఖీ ఆలయంలో పూజలు

శివ్వంపేటలో కొలువైన బగలాముఖి ఆలయంలో వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వివరాలు 3లో ▸

న్యూస్‌రీల్

కాలరాత్రి అలంకరణలో ఏడుపాయల దుర్గమ్మ

- పూజలు చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ రమేశ్



అమ్మవారికి పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ రమేశ్

పాపన్నపేట(మెదక్): దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడుపాయల దుర్గా భవానీ మాత భక్తులకు కాలరాత్రి (దుర్గాదేవి) అలంకరణలో వీణాధారిణియై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పూజారులు శంకరశర్మ తెలుపు రంగు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం 9 గంటలకు వేద పండితులు సనాతన శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి, ధర్మకర్తలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేశ్ అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేకు, అదనపు కలెక్టర్‌కు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి,శాలువాతో సత్కరించారు.

ధూం..ధాంగా బోనాలు

ఏడుపాయల్లో ఉదయం 11 గంటలకు బోనాల ఊరేగింపు ధూం ధాంగా కొనసాగింది. బాలాపూర్ జోగిని పావని చేసిన బోనాల నృత్యం, దుబ్బాక వాయిద్య కళాకారులు చేసిన నృత్యాలు అశేష భక్తులను ఉర్రూత లూగించాయి. బాలాపూర్ జోగిని పావని, పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి,బోనమెత్తి శోభాయాత్ర ప్రారంభించారు. గోకుల్ షెడ్డు నుంచి దుర్గమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు కొనసాగింది.

సిద్దిపేటకు రైలు తెచ్చింది మోదీ

- కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ




స్మృతీ ఇరానీని భారీ గజమాలతో సన్మానిస్తున్న రఘునందన్‌రావు, బీజేపీ శ్రేణులు

దుబ్బాకటౌన్: సిద్దిపేటకు రైలు తెచ్చింది కేసీఆర్ కాదని, ప్రధాని నరేంద్ర మోదీ అని కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ అన్నారు. శుక్రవారం దుబ్బాకలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు అధ్యక్షతన మహిళా సమ్మేళనం-నారీ శక్తి వందనం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తన స్వార్థం కోసం తెలంగాణ యువతను వంచించింది కేసీఆర్ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా కేసీఆర్ సర్కార్ నిలిచిందని మండిపడ్డారు. ఇంతటి అవినీతి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. అల్లుడు, మామ, కొడుకు, బిడ్డతో కొట్లాడి గెలిచిన నాయకుడు రఘునందన్‌రావు అని కితాబిచ్చారు.

105 సీట్లు మనవే..

గజ్వేల్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల భేటీలో కేసీఆర్

- రాష్ట్రంలో కరెంటు కష్టాలు తీర్చాం.. వ్యవసాయాన్ని స్థిరీకరించాం
- కోదండరాం, కాంగ్రెస్ నేతలు అడ్డుపడ్డా ప్రాజెక్టులు పూర్తి చేశాం
- గజ్వేల్‌కు ఇంకా ఎంతో చేయాల్సి ఉంది... ఇన్నాళ్లు బరువు బాధ్యతలతో తగిన సమయం ఇవ్వలేకపోయా..
- ఇక నుంచి నియోజకవర్గానికి నెలకోరోజు కేటాయిస్తా..
- మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల సమస్యలన్నీ తీరుస్తానని హామీ...'గజ్వేల్‌లోనే ఉంటా.. ఈసారి నాకు మెజార్టీ ఎంత ఇస్తారో మీ దయ' అంటూ వ్యాఖ్య



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో 95 నుంచి 105 సీట్లు గెలుస్తామని.. ఈ విషయంలో తనకుఎలాంటి అనుమానం లేదని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కరెంటు కష్టాలు తీర్చామని, వ్యవసాయాన్ని స్థిరీకరించగలిగామని చెప్పారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌కు చేయాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి గోదావరి జలాలను అందిస్తానని.. కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని ప్రకటించారు. ఇన్నాళ్లు బరువు బాధ్యతల వల్ల నియోజకవర్గ కేడర్‌కు తగిన సమయం ఇవ్వలేకపోయానని, ఇకపై నెలకోరోజు గజ్వేల్‌కు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తలతో మంత్రి హరీశ్‌రావుతో కలసి కేసీఆర్ సమావేశమయ్యారు. సుమారు

మిగతా 4వ పేజీలో ▶

సింహం వైపు చూపు

- కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ రాకపోయినా బరిలో..
- ఏఐఎఫ్‌బీ నుంచి పోటీకి సిద్ధమవుతున్న నేతలు
- చర్చలు జరుపుతున్న పలువురు



సాక్షి, సిద్దిపేట: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలవాలనుకుంటున్న నేతలు టికెట్ రాకపోయినా పోటీ చేయాలనుకుంటున్నారు. దీంతో ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయడమా.. లేదంటే ఇతర రాజకీయ పార్టీ తరఫున బరిలో నిలవడమా అని ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రతి నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు నేతలు పోటా పోటీగా టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నారు. ఇండిపెండెంట్‌కు బదులు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) నుంచి అయితే ఎన్నికల గుర్తు సింహం కాబట్టి ప్రజల్లోకి వేగంగా వెళ్తుందని భావిస్తున్నారు.

ఆశావహులు ఎక్కువే..

జిల్లాలో ఇప్పటికే అధికార బీఆర్ఎస్ అన్ని నియోజకవర్గాల నుంచి బరిలో నిలిచే వారి టికెట్లను ప్రకటించి అభ్యర్థులకు బీఫాంలు సైతం అందజేసింది. బీజేపీ ఇప్పటివరకు ఒక్క లిస్టు సైతం విడుదల చేయలేదు. కాంగ్రెస్ ఈనెల 15న విడుదల చేసిన మొదటి జాబితాలో గజ్వేల్ నుంచి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని ప్రకటించింది. ఇంకా హుస్నాబాద్, దుబ్బాక, సిద్దిపేట, జనగామ ప్రకటించాల్సి ఉంది. హుస్నాబాద్ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వర్గంగా ప్రవీణ్‌రెడ్డి కొనసాగుతుండగా, కాంగ్రెస్ జాతీయ నేతల ద్వారా ప్రభాకర్ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. దుబ్బాక నుంచి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కత్తి కార్తీక టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. హుస్నాబాద్‌లో బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర హౌజ్‌ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఇద్దరు పోటాపోటీగా ప్రయత్నిస్తున్నారు. ఇద్దరు నేతలు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

మెదక్‌లో నువ్వా.. నేనా!

మెదక్ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ప్రధాన పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రచార జోరు పెంచాయి. గెలుపే లక్ష్యంగా నాయకులు దూసుకెళ్తున్నారు. మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రయత్నిస్తుండగా , తన తండ్రి స్థాపించిన సోషల్ సర్వీస్‌తోపాటు తాను చేస్తున్న సేవా కార్యక్రమాలే గెలిపిస్తాయని కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావు నాయకులు, కార్యకర్తలతో పోటీపడి ప్రచారం చేస్తున్నారు. దీంతో మెదక్‌లో రాజకీయం నువ్వా.. నేనా అనే విధంగా మారింది. –మెదక్



మహిళా కార్యకర్తలతో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్

నియోజకవర్గంలో రసవత్తరంగా రాజకీయం

- హ్యాట్రిక్ కోసం ఒకరు.. గెలుపు కోసం మరొకరు
- పోటాపోటీగా ప్రచారాలు
- చేసిన పనులే గెలిపిస్తాయని ముందుకు..

ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వ్యూహ, ప్రతివ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. అధికార బీఆర్ఎస్ ఇప్పటివరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటేయాలని సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భవించాక 2014, 2018లో వరుసగా రెండుసార్లు పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్ నుంచి విజయఢంకా మోగించారు. 2014లో గెలుపొందిన ఆమెను డిప్యూటీస్పీకర్ వరించింది. కాగా, మంత్రి హరీశ్ రావును నమ్ముకున్న ఆమె ఆయన సూచనలతో మరోసారి ముందుకు సాగుతున్నారు.

పలువురి చేరికతో బలంగా..

ఇప్పటికే కుల సంఘాలు , యువజన సంఘాల ప్రతినిధులను కలసి మద్దతు కూడగడుతున్నారు. ప్రత్యర్థి పార్టీని నైతికంగా దెబ్బతీసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు గాలం వేస్తున్నారు. పదవులను ఆశిస్తున్న వారిని దగ్గరకు తీసుకుంటున్నారు. అలాగే కొందరిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని తెలుస్తోంది. ఇప్పటికే డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి , మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు, చిన్నశంకరంపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతరాజు రమణతో పాటు వైస్ ఎంపీపీ, ముగ్గురు ఎంపీటీసీలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన వారికి అన్ని రకాల సహకరిస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు.

సేవా కార్యక్రమాలతో ముందుకు...

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ముందుగా సేవా కార్యక్రమాల ద్వారానే రాజకీయ ప్రవేశం చేశారు. 2004లో హన్మంతరావు భార్య మైనంపల్లి వాణి పద్మాదేవేందర్‌రెడ్డిపై పోటీచేసి మొదటిసారి ఓటమి చవిచూశారు. ఆ తర్వాత 2008, 2009 ఉప ఎన్నికల్లో రెండుసార్లు హన్మంతరావు ఎమ్మెల్యేగా గెలు పొందారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలలో భాగంగా ఆయన మల్కాజ్‌గిరి వెళ్లారు. తన తండ్రిని అనుసరిస్తున్న రోహిత్ ఈయేడు ఫిబ్రవరి మాసంలో మైనంపల్లి సోషల్ సర్వీస్(ఎంఎస్ఎస్) ద్వారా సేవా కార్యక్రమాలతో వచ్చారు. ముందుగా బీఆర్ఎస్ టికెట్‌ను ఆశించి భంగపడి కాంగ్రెస్ టికెట్ కైవసం చేసుకున్నారు. గెలుపే లక్ష్యంగా రాజకీయం, సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆరుమాసాలుగా అనాథపిల్లలను దత్తత తీసుకొని వారిని ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు శిథిలావస్థకు చేరిన ఎన్నో ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు.

సొంత నియోజకవర్గం కావడంతో...

మైనంపల్లి సొంత నియోజవర్గం ఇదే కావడం వారికి కలసి వస్తుందని భావిస్తున్నారు. కొడుకు టిక్కెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి అధికార పార్టీనే వదులుకున్న మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఎలాగైనా కొడుకును గెలిపించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. బీఆర్ఎస్ పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలను ఒక్కతాటిపైకి తెచ్చేవిధంగా కృషి చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులపై పదునైన విమర్శలు చేస్తూ కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. గెలుపే లక్ష్యంగా వారికి సూచనలు చేస్తున్నారు.

పూలను పూజించేది తెలంగాణలోనే..

- జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బ్రహ్మాజీ



మాట్లాడుతున్న బ్రహ్మాజీ

నర్సాపూర్ రూరల్: పూలను పూజించే సంస్కృతి తెలంగాణకే దక్కిందని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని బ్రహ్మాజీ అన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఐసీడీఎస్, స్వీప్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి బ్రహ్మాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటేయాలి:

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని సూచించారు. బతుకమ్మ సంబరాలకు ముందు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగించుకొని జిల్లాలో మొదటి స్థానంలో ఉంచాలంటూ నినాదాలు చేస్తూ బతుకమ్మ లతో ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి ప్రలోబాలకు ఇవ్వకుండా, భయభ్రాంతులకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమభార్గవి, మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాలకృష్ణ , సూపర్ వైజరులు సరళకుమారి, శశికళ, సంతోష, వసుమతి, సక్కుబాయి, సంతోషిమాత, సుజాత లక్ష్మి పాల్గొన్నారు.

4,34,900 మంది ఓటర్లు

- 579 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- బ్యాలెట్ యూనిట్లు 25, వీవీప్యాడ్‌లు 40 శాతం అదనం
- జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- రెండు నియోజకవర్గాల నాయకులతో సమావేశం



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని రెండు నియోకవర్గాల్లో మొత్తం 4,34,900మంది ఓటర్లు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా 579 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని రెండు నియోజక వర్గాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 25 శాతం , వీవీ ప్యాడ్‌లు 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్‌లో నియోజక వర్గం, పోలింగ్ బూత్ వారీగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమాటిక్ యంత్రాలు చేశామన్నారు.

డీఆర్సీ సెంటర్ పరిశీలన..

అంతకు ముందు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్టిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ రోహిణీప్రియదర్శిని, ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ , తహసీల్దార్ శ్రీనివాస్, డీఎస్పీ ఫణీంద్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆంజనేయులు, నర్సింలు, బస్వరాజ్, అఫ్జల్, ఇస్రత్, గౌస్ కురేషి, , తదితరులు పాల్గొన్నారు.

నేడు యూనిట్లు తరలింపు..

జనరేట్ చేసిన జాబితా ప్రకారం శనివారం కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాడ్‌లను ఆయా నియోజకవర్గ వర్గాలకు గట్టి భద్రత మధ్య తరలిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఏవీఎం గోదాములకు రావాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. అక్కడ ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని తెలిపారు.

వంద శాతం ఓటింగ్ సాధించాలి

పాపన్నపేట(మెదక్): ప్రజాసామ్యంలో ఓటు హక్కు ప్రజల చేతిలో పాశుపతాస్త్రం లాంటిదని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఆయన పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి, యూసుఫ్‌పేట గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలన కోసం ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడానికి 100 శాతం ఓటింగ్ సాధించాలని కోరారు. నేను ఓటు వేస్తాననే నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. అధికారులంతా ప్రజలను చైతన్య వంతులను చేయాలని కోరారు. సమావేశానికి ప్రజలు తక్కువ సంఖ్యలో రావడంతో తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ రోహిణీ ప్రియదర్శిణి మాట్లాడుతూ ఎలాంటి ప్రలోబాలకు లోను కాకుండా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అవినీతి జరిగితే 1950 ఫోన్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో డీఎస్పీ ఫణీందర్, సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అక్షరదేవతకు నీరాజనం



వర్గల్ క్షేత్రంలో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి

వర్గల్(గజ్వేల్): పూలమాలికలే ఛత్రాలుగా పుష్పాలంకృతమైన అమ్మ సన్నిధానం పూదోటను మరిపించింది. నవరత్న మణిమయ స్వర్ణకిరీటంతో శ్రీవిద్యా సరస్వతి మాత దర్శనమిచ్చారు. అమ్మవారి నామస్మరణతో మార్మోగగా, ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లిన ఈ అపూర్వఘట్టం శుక్రవారం దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో కీలకమైన 'మూల'మహోత్సవం సందర్భంగా ఆవిష్కృతమైంది. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి, పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యాశంకరభారతి స్వామి పర్యవేక్షణలో మూల నక్షత్ర పూజలకు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా విశేష పంచామృతాభి షేకం, లక్ష పుష్పార్చన, పుస్తకరూపిణి పూజ, చండీ హోమం, చతుశ్షష్ఠ్యుపచారపూజ, సప్తశతి పారాయణం చేశారు. శ్రీవిద్యాసరస్వతీదేవిగా నిజరూప దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మంత్రి సత్యవతి రాథోడ్ అమ్మవారిని దర్శించుకుని, తన మనవరాలు ఆద్యకు అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం జరిపించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. రంగంపేట, పుష్పగిరి, శ్రీక్షేత్రం పీఠాధిపతులు శ్రీమాధవానంద సరస్వతి, శ్రీవిద్యా శంకరభారతి స్వామి, శ్రీమధుసూదనానంద సరస్వతి స్వాములు అమ్మవారి సేవలో తరించారు. భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

1600 పైగా అక్షరాభ్యాసాలు

సరస్వతిమాత జన్మనక్షత్ర వేళ క్షేత్రంలో రోజంతా చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి కొనసాగింది. సాయంత్రం వరకు 1600పైగా అక్షరాభ్యాసాలు జరిగాయి.


పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం



సిద్దిపేటజోన్: జాతీయ పవర్ లిఫ్టింగ్ చాపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించినట్లు పవర్ లిఫ్టర్ అనుగు స్పూర్తి తెలిపారు. ఈ నెల 12 నుంచి 15 వరకు బెంగళూరులో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఈ పతకం సాధించినట్లు పేర్కొన్నారు. కాగా స్పూర్తి సిద్దిపేట జిల్లాకు చెందిన క్రీడాకారిణి.

రాజకీయ చైతన్యానికి అడ్డా.. దుబ్బాక గడ్డ

- నాటి దొమ్మాట నుంచి నేడు దుబ్బాక నియోజకవర్గంగా..
- తెలంగాణ ఉద్యమానికి గుండెకాయ
- మంత్రితో పాటు ఎన్నో ఉన్నత పదవులు అందించిన ప్రాంతం
- మూడు జిల్లాల సరిహద్దులు
- అత్యధికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం



దుబ్బాకటౌన్: తెలంగాణ రాష్ట్రంలోనే ఉద్యమాల ఖిల్లాగా దుబ్బాక నియోజకవర్గం పేరుగాంచింది. మొదటి నుంచి విప్లవోద్యమాలకు అడ్డాగా గుర్తింపు పొందింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు నక్సలైట్ దళాలు ఈ నియోజకవర్గంలో పనిచేయడంతో దేశవ్యాప్తంగా దుబ్బాక పేరు మార్మోగింది. మూడు జిల్లాల సరిహద్దుల్లో ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలను కలుపుతూ మధ్యలో ఉండే నియోజకవర్గం దుబ్బాక. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైనది కావడంతో నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైన చాలామంది ఉన్నత పదవులు పొందారు. మంత్రి పదవితో పాటు, డిప్యూటీ స్పీకర్, శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్లు, టీటీడీ బోర్డు మెంబర్లుగా ఉన్నత బాధ్యతలు చేపట్టి దుబ్బాక నియోజకవర్గానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

1957లో దొమ్మాట నియోజకవర్గంగా..

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తొలిదశలో రాజగోపాలపేటగా ఉన్న ఈ నియోజకవర్గంలో దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లోని పలు మండలాలు ఉండేవి. ఆ తర్వాత 1957లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా రాజగోపాలపేట స్థానంలో దొమ్మాట నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన దొమ్మాట నియోజకవర్గంలో దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, కొండపాక మండలాలు ఉండేవి. 2001లో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న చెరుకు ముత్యంరెడ్డి మిరుదొడ్డి, కొండపాక మండలాల నుంచి 17 గ్రామపంచాయతీలను కలిపి కొత్తగా తొగుట మండలంను ఏర్పాటు చేశారు. దీంతో అప్పటి నుంచి ఐదు మండలాలతో దొమ్మాట నియోజకవర్గం ముఖ చిత్రంగా ఏర్పడింది.


దుబ్బాక పట్టణం వ్యూ

2009లో దుబ్బాక నియోజకవర్గంగా..

2009 ఎన్నికల ముందు నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ సమయంలో దొమ్మాట నియోజకవర్గం కాస్త దుబ్బాక నియోజకవర్గంగా అవతరించింది. దుబ్బాకలో కొండపాక మండలంను కలపకుండా గజ్వేల్ నియోజకవర్గంలో చేర్చి.. అప్పటి రామాయంపేట నియోజకవర్గంలో ఉన్న చేగుంట మండలాన్ని దుబ్బాకలో చేర్చారు. అంతేగాకుండా అప్పటి వరకు దుబ్బాక మండలంలోని 11 గ్రామాలు, మిరుదొడ్డి మండలంలోని ధర్మారం గ్రామం సిద్దిపేట నియోజకవర్గంలో ఉండగా వాటిని దుబ్బాక నియోజకవర్గంలో కలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా మండలాలు ఏర్పర్చడంతో కొత్తగా రాయపోల్, నార్సింగ్, భూంపల్లి-అక్బర్‌పేట మండలాలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట, నార్సింగ్, భూంపల్లి-అక్బర్‌పేట మండలాలతో పాటుగా గజ్వేల్ మండలంలోని ఆరపల్లి గ్రామంతో కలిసి దుబ్బాక నియోజకవర్గంగా ఉంది.

ఏ పార్టీలు ఎన్నిసార్లు?

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16 పర్యాయాలు శాసనసభ ఎన్నికలు జరిగాయి. అందులో 5 సార్లు కాంగ్రెస్, 4 సార్లు టీడీపీ, 4 పర్యాయాలు బీఆర్ఎస్, ఒకసారి బీజేపీ విజయం సాధించడం విశేషం. కమ్యూనిస్టు, పీడీఎఫ్, ఇండిపెండెంట్‌లు ఒక్కోసారి గెలుపొందారు.

రాజకీయంగా ఎన్నో మార్పులు..

రాజకీయంగా దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. 1952లో తొలిసారి రాజగోపాలపేట నియోజకవర్గం పేరిట జరిగిన ఎన్నికల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కే.వీ.నారాయణరెడ్డి కమ్యూనిస్టుల మద్దతుతో గెలిచారు. 1957 ఎన్నికల్లో వంగ హనుమంతరెడ్డి అలియాస్ ఆశిరెడ్డి పీడీఎఫ్ తరఫున విజయం సాధించారు. 1962 ఎన్నికల్లో ఎంకే మోహినొద్దీన్ కాంగ్రెస్ తరఫున గెలిచారు. 1967 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన ఎం.భీంరెడ్డి తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 1972 ఎన్నికల్లో దుబ్బాక మండలం చిట్టాపూర్‌కు చెందిన సోలిపేట రాంచంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచారు. 1978లో దుబ్బాకకు చెందిన ఐరేని లింగయ్య కాంగ్రెస్ నుంచి గెలిచి శాసనసభ ఉపసభాపతి పదవిని పొందారు. 1988లో టీడీపీ ప్రభంజనంతో రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోయిన దొమ్మాటలో కాంగ్రెస్ నుంచి ఐరేని లింగయ్య విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కొండపాకకు చెందిన డి. రాంచంద్రారెడ్డి టీడీపీ నుంచి గెలుపొందారు. 1989,1994,1999 లో టీడీపీ నుంచి చెరుకు ముత్యంరెడ్డి వరుసగా హ్యాట్రిక్ విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికల బరిలో దిగిన బీఆర్ఎస్ తరఫున జర్నలిస్టుగా ఉన్న సోలిపేట రామలింగారెడ్డి పోటీచేసి వరుస విజయాలతో ఉన్న ముత్యంరెడ్డిపై గెలుపొందారు.అనంతరం తెలంగాణ ఉద్యమపరిణామాల్లో భాగంగా 2008 లో జరిగిన ఉప ఎన్నికల్లో సోలిపేట రామలింగారెడ్డి మళ్లీ బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంకు జరిగిన మొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి చెరుకు ముత్యంరెడ్డి గెలుపొందారు. 2014 తెలంగాణ రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి సోలిపేట రామలింగారెడ్డి ఘనవిజయం సాధించారు. 2018లో నాలుగోసారి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా సోలిపేట 66వేల పై చిలుకు ఓట్లతో రాష్ట్రంలోనే 7వ రికార్డు మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2020 ఆగస్టులో రామలింగారెడ్డి అనారోగ్యంతో మరణించారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్‌రావు వెయ్యికి పై చిలుకు ఓట్లతో రామలింగారెడ్డి సతీమణి సోలిపేట సుజాతపై గెలుపొందారు.

కీలక పదవులు

నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు రాష్ట్ర కేబినేట్‌లో ఎన్నో కీలకమైన పదవులు చేపట్టారు.1978లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఐరేని లింగయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవిని అలంకరించారు. 1994లో టీడీపీ నుంచి రెండోసారి గెలుపొందిన చెరుకు ముత్యంరెడ్డి రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా, 1999లో టీడీపీ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన చెరుకు ముత్యంరెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన చెరుకు ముత్యంరెడ్డి టీటీడీ బోర్డు మెంబర్‌గా పనిచేశారు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సోలిపేట రామలింగారెడ్డి రాష్ట్రశాసన సభ అంచనాల కమిటీ చైర్మన్‌గా ఉన్నతమైన పదవులు చేపట్టారు.



పోలింగే లక్ష్యం

- ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో యువత, దివ్యాంగులకు ఐదేసి చొప్పున
- మహిళలకు 25 కేంద్రాలు

నారాయణఖేడ్: వంద శాతం పోలింగే లక్ష్యంగా ఎన్నికల అధికారులు ముందుకు సాగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లను ఆకట్టుకోవడంపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి ఓటు వినియోగంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. దీంతోపాటు పోలింగ్ కేంద్రాలకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు మొదటి సారిగా ప్రతీ నియోజకవర్గానికి యువతకు, ఆదర్శ, దివ్యాంగులకు ఒక్కొక్కటి, మహిళల కోసం ఐదు చొప్పున జిల్లాలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా మొత్తంలో 1,594 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకంగా మహిళా అధికారిణులు, సిబ్బంది నిర్వహించే కేంద్రాలు నియోజకవర్గానికి ఐదు చొప్పున జిల్లాలో 25, ప్రత్యేకంగా యువ అధికారులు, సిబ్బంది నిర్వహించే కేంద్రాలు ఐదు, దివ్యాంగ అధికారులు, సిబ్బంది నిర్వహించే కేంద్రాలు ఐదు ఏర్పాటు చేస్తున్నారు.


ఓటింగ్‌పై కిషన్ నాయక్ తండాలో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శరత్

యువ ఓటర్లపై దృష్టి

ఎన్నికల్లో యువ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతీ నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానంతో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సత్ఫలితాలు వచ్చాయి. నియోజకవర్గంలో యువ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వారి కోసం ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఎన్నిల నిర్వహణ బాధ్యతల్లో యువ అధికారులు, సిబ్బందిని నియమిస్తారు.

మహిళల కోసం..

మహిళా ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రతీ నియోజకవర్గంలో ఐదు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్న కేంద్రాలను ఎంపిక చేసి ఎన్నికల నిర్వహణ అధికారులు, ఇతర సిబ్బందిని మహిళలనే నియమించనున్నారు. మహిళా అధికారుల ఆధ్వర్యంలోనే ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి ఐదు చొప్పున మొత్తం 25 మహిళా ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గంలో దివ్యాంగుల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక వసతులు కల్పించనున్నారు. అన్ని కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు వారు వారు కూర్చోవడానికి ప్రత్యేక వసతులు కల్పించనున్నారు.




ఆదర్శ పోలింగ్ కేంద్రాలు

గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలను గుర్తించి అక్కడ ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు కేంద్రాలను ఎంపిక చేయనున్నారు. ఈ ఎన్నికల్లో అధికంగా ఓట్లు నమోదయ్యేలా దృష్టిసారించనున్నారు. ఆదర్శ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నారు.

వీడని ఉత్కంఠ

నర్సాపూర్‌లో అభయ హస్తం ఎవరికో?

- కాంగ్రెస్ టికెట్ కోసం ఆవుల, అనిల్ మధ్య తీవ్ర పోటీ
- ముఖ్య నాయకుల ద్వారా ముమ్మర ప్రయత్నాలు


గాలి అనిల్ కుమార్
ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం ఇద్దరు నాయకులు పోటీ పడుతున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్‌లు కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. వీరిద్దరితో పాటు పీసీసీ డెలిగేట్లు అంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనిల్‌కుమార్, రాజిరెడ్డిల పేర్లు మాత్రమే పార్టీ జాతీయ కమిటీకి పంపినట్లు తెలిసింది. వీరిద్దరికి ఉన్న పరిచయాలతో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రంలో 55 మంది అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించగా..అందులో నర్సాపూర్ క్యాండెట్ పేరు లేదు. దీంతో నియోజకవర్గం నుంచి ఎవరికి టికెట్ దక్కుతుందోననే ఆసక్తి నెలకొంది.

ఇతర పార్టీల నాయకుల కోసమేనా?

నర్సాపూర్ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించడంలో కాంగ్రెస్ పార్టీ కావాలనే జాప్యం చేస్తుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి బీఆర్ఎస్‌లో టికెట్ రాకపోతే కాంగ్రెస్‌లోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. అందుకే నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించలేదని తెలుస్తోంది. అంతేకాకుండా మదన్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్ కోసం ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులను కలిశారని ప్రచారంలో ఉంది. కాగా బీఆర్ఎస్ పార్టీ సైతం నర్సాపూర్ అభ్యర్థిని ప్రకటించకపోయినా మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డికే ఈసారి టికెట్ ఇస్తారని, మదన్‌రెడ్డికి ఇతర పదవి ఇస్తారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. సునీతారెడ్డి కూడా ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలకు మరికొన్ని రోజులు మాత్రమే ఉండటం, ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించకపోవటంతో కాంగ్రెస్ గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు.



ఎవరికి వారు ప్రచారం

నర్సాపూర్ కాంగ్రెస్ టికెట్ ఎవరికీ కేటాయించనప్పటికీ రాజిరెడ్డి, అనిల్‌కుమార్‌లు ప్రచారం మొదలు పెట్టారు. రాజిరెడ్డి పార్టీ నాయకులతో కలిసి పలు గ్రామాలలో పర్యటిస్తున్నారు. ప్రజలను కలిసి ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. అనిల్‌కుమార్ సైతం గురువారం మాసాయిపేట మండలం రామంతాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం రామంతాపూర్, లింగారెడ్డిపల్లె, వెల్దుర్తి మండలంలోని ఉప్పులింగాపూర్, అచ్చంపేట గ్రామాలలో పర్యటించి కాంగ్రెస్ పథకాల గ్యారంటీల కార్డులను ప్రజలకు అందజేశారు. మొత్తానికి నర్సాపూర్ కాంగ్రెస్ టికెట్ కేటాయింపుపై టెన్షన్ నెలకొంది. పార్టీలో ఉన్న నాయకులకే టికెట్ ఇస్తారా లేదా.. ఇతర పార్టీ నుంచి వచ్చే వ్యక్తికి టికెట్ ఇస్తారా అనేది వేచి చూడాలి.

గులాబీ జోష్

సీఎం కేసీఆర్‌కు నాగలిని బహూకరిస్తున్న దేవి రవీందర్

- బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం
- భారీగా తరలిన పార్టీ శ్రేణులు
- మెజారిటీ మీ దయ... అంటూ సీఎం వ్యాఖ్యలు



గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సీఎం కేసీఆర్ శుక్రవారం నిర్వహించిన సమావేశం జోష్ నింపింది. ఎన్నికల వేళ... నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలకు ఈ సందర్భంగా సీఎం దిశానిర్దేశం చేశారు. మంత్రి హరీశ్‌రావుతో కలిసి సీఎం కేసీఆర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించగా.. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మెదక్ జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, మార్కెట్ కమిటీల చైర్మన్లు జహంగీర్, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, నాచారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొట్టాల యాదగిరిలు ప్రసంగించగా...శాసన సభ మాజీ స్పీకర్ మధుసూదనచారి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రైతు బంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్ పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డి చెప్పిండు..

కుడ్లేరు, హల్దీవాగులు నింపినమ్

గజ్వేల్ నియోజకవర్గంలోని హల్దీ, కుడ్లేరు వాగులను జీవనదులుగా మార్చాలి సార్...అంటూ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి చెప్పిండు...వెంటనే వాగులను నింపినం... ఎండాకాలంలో కూడా పారేలా చేసినమ్. ఇప్పుడు మళ్లా...సార్ మీ దయ వల్ల రైతులు వాగుల్లో బోర్‌మోటర్లు వేసుకొని పంటలు కాపాడుకుంటున్నరు. అని చెప్పిండు సంతోషం అనిపించింది.

భారీగా తరలిన నాయకులు, కార్యకర్తలు

సీఎంతో సమావేశంలో పాల్గొనేందుకు నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, మర్కూక్, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. దీంతో అంతాయిపల్లి రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. సభాస్థలి వద్ద వంటేరు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో సీఎంను కలిసేందుకు నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు. అదేవిధంగా సమస్యలపై వినతి పత్రాలు వెల్లువెత్తాయి. ప్రధానంగా తూప్రాన్ డిగ్రీ కళాశాల, జగదేవ్‌పూర్‌లో కేజీ టూ పీజీ విద్యా సౌకర్యాలు, బందారం, అంకిరెడిపల్లికి కాల్వల గోదావరి జలాల తరలింపు అంశాలపై సీఎం హామీలు ఇచ్చారు.

మెజారిటీ మీ దయ..

కేసీఆర్ సమావేశంలో మాట్లాడుతూ.. మెజారిటీ మీ దయ.. అంటూ వ్యాఖ్యానించడం ఆసక్తిని రేకెత్తించింది. ఈవిధంగా వ్యాఖ్యలు చేయడం ద్వారా సీఎం మరోసారి కార్యకర్తలు, నాయకుల మనసును దోచుకున్నారు. మాజీ కార్పొరేషన్ మడుపు భూంరెడ్డి తన ప్రసంగంలో సారూ.. మీరు సీఎం అయినా.. ప్రధాని అయినా మాకు అప్పుడప్పుడు మీ ప్రత్యక్ష దర్శనం కావాలి...అంటూ వేడుకున్నారు. భూంరెడ్డి మాటలపై తన ప్రసంగంలో స్పందించిన కేసీఆర్.. సీఎంగా తనకున్న బరువు, బాధ్యతల వల్ల మీకు టైమ్ ఇవ్వలేకపోతున్నానని బాధపడుతున్న... ఇక నుంచి అట్ల ఉండదు. నెలలో ఒక రోజు నియోజకవర్గానికి కేటాయిస్తా అంటూ ప్రకటన చేశారు. దీంతో కార్యకర్తల్లో ఒక్కసారి కేరింతలతో చప్పట్ల వర్షం కురిపించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో గత కొన్నాళ్లుగా తమ సమస్యలు తీరక కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ నిర్వాసితులు ఇక్కట్లు పడుతున్నారు. దండం పెడుతున్న...మీ త్యాగం గొప్పది. ఎన్నికల అయిపోగానే ఇరిగేషన్ సెక్రటరీ, కలెక్టర్ వెంటబెట్టుకొని గజ్వేల్‌కు వస్త. రోజంతా మీతోనే ఉంటా, మీ సమస్యలన్నీ అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చూస్తా...అంటూ హామీ ఇచ్చారు.

తండాలను జీపీలుగా చేసింది బీఆర్ఎస్

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ ఎమ్మెల్యేగా మూడోసారి దీవిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలం కట్కూర్, దుబ్బతండా, చాపగానీతండా, కన్నారంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు కోలాటాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చాపగానీ తండాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. తండాల్లో తారురోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు భూక్య మంగ, పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఎమ్మెల్యే తనయుడు ఇంద్రనీల్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మాలోతు భీలునాయక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లింగాల సాయిన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

క్షేత్ర పర్యటనలో ఎన్‌సీసీ, ఎన్ఐసీ క్యాడెట్లు

గజ్వేల్‌రూరల్: స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌నకు(ఎస్ఎన్ఐసీ) వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ఎన్‌సీసీ, ఎన్ఐసీ క్యాడెట్లు క్షేత్ర పర్యటనలో ఉత్సాహంగా పాల్గొన్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న సంయుక్త శిక్షణా కార్యక్రమంలో భాగంగా పలువురు క్యాడెట్లు శుక్రవారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపు పర్యటన అధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకీ పర్యటన వివరాలను క్యాడెట్లకు తెలియజేశారు. అదేవిధంగా గజ్వేల్‌లో కొనసాగుతున్న వాలీబాల్ పోటీలలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ – ఢిల్లీ డైరెక్టరేట్‌ల మధ్య ఫైనల్ జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే శిక్షణలో భాగంగా గ్రూప్ డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు క్రీడా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ జైశ్వాల్, డిప్యూటీ కమాండర్ కల్నల్ పీఎస్ నందా, కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు, గజ్వేల్ ఫైర్ ఆఫీసర్ సురేష్, క్రీడా నిర్ణేతలు ప్రభు, భాను పాల్గొన్నారు.


రామోజీ ఫిల్మ్‌సిటీలో ఎన్‌సీసీ, ఎన్ఐసీ క్యాడెట్లు